
# పైలం బిడ్డ...!

డా॥ కాలువ మల్లయ్య

బతుకమ్మ పండుగరోజులు- జూబ్లీ బస్సు స్టేషన్ లస్కర్ జనంతోపాటు అనేకమందితో క్రిక్కిరిసి ఉంది. బస్సులు దొరకడం కష్టమవుతుంది. ఎన్ని బస్సులొచ్చినా తొందరగనే నిండి పోతున్నయి. జనం గొణుక్కుంటున్నరు. విసుక్కుంటున్నరు. ఇక వశంగాక కంట్రోలర్ దగ్గరకు పోయింద్రు.

‘‘పండుగలప్పుడన్న బాగ బస్సులేత్తేంది? జనమెంతమందున్నరో సూడుండ్రి. మీకేమన్న బాధ్యతుందా?’’ కోపంగన్నడొగాయినె.



''ఎందుకుసార్ మా మీదికి లేత్తరు. సిటీ బస్సులను గూడ అటు మర్లిస్తిమి. మమ్ముల్నేం చెయ్యిమంటరు? ఎన్ని బస్సులేసినా చాలుతలెవ్వాయె..!

''ఎట్ల చాలుతయి? కరీంనగర్‌కు రైల్వే లైనే లేకపాయె. చచ్చుకుంట, బతుక్కుంట బస్సులనే పోవన్నాయె..''

''దానికి మమ్ములనేం జెయ్యిమంటరు? మేం గూడ మీ తీరుగనే నౌకరగాళ్ళమైతిమి. రైలేయించుడు నా చేతిలుందా?'' అన్నడు నవ్వుకుంట కంట్రోలర్.

''ససంత్రమచ్చి యాభయేండ్లు దాటినా గని కరీంనగర్ జిల్లా కేంద్రానికి రైలు సౌకర్యం లేకపాయె. పండుగలప్పుడు గీ కాతనమందుంటరు గద! ఎట్ల పోతరు?''

''సార్! గిప్పుడు గా చర్చలన్నెందుకుగని అగో రొండు స్పెషల్ బస్సులస్తున్నయి. దవ్వ దవ్వెళ్లి పోండ్రి..''

రాఘవులతోపాటు గుంపుకు గుంపు జెనం అక్కన్నుంచిరికిండ్రు. అతి కష్టంగ చివర్లో ఓ సీటు సంపాయించుకున్నడు రాఘవులు. కిటికిల నుంచి మొకం బయటకు పెట్టి సూత్తున్నడు.

''రాగన్నా..కొడుకా..! ఓ బిడ్డా...'' పిలిచింది బుచ్చవ్వ.

చిప్పిరెంటుకలతోని లస్కర్ అవ్వ తీరుగున్న తన తల్లి దిక్కు చూసిండు రాఘవులు. ఆమె ముఖంలున్న భయాన్ని గమనించిండు.

''ఏందవ్వా! ఎందుకో భయపడుతున్నట్టున్నవు?''

''బస్సుల మాలేషు ముందున్నరు. పండుగకందరు ఇండ్లకు పోతండ్రు గద..! ముత్తెమంత సేపయితె బస్సుపోతది..''

''పోకుంటె ఆగుతాదవ్వ బస్సిక్కడ..''

''సరెగని పైలంగ పో బిడ్డ..''

ఆమాట రాఘవుల చెవులకు విందు చేసినట్టుంది.

''ఏమన్నవే అవ్వ! ఏమన్నవు?''

''నేనేమన్న బిడ్డ! పైలంగ పోయి రా అన్న. కరీంనగర్ దాటి పెద్దపెల్లి దాటి ఇంకా పోతన్నాయె..నువ్వక్కడ చేరెవారకు రాత్రియితది. మంచిగ పొమ్మన్న. గంతే..!''

''మంచిగనే పోతనే అవ్వ! అవి నాకేమన్న తెలువనూళ్ళా ఏంది? మనం ఉన్న ఊళ్ళేనాయె. నేంబోయేది మనూరికేనాయె..''

బస్సు జనంతోని నిండిపోతనే ఉంది. కాలుబెట్ట సందులేకుంటున్నా ఇంకా ఎక్కుతనే ఉన్నరు.

''ఎంత తెలిసిన ఊళ్ళయినా కడుపులు చేతుల్ల బట్టుకొని వత్తిమిక్కడికి. అక్కడ ఉండవశెం గాకనే వత్తిమి. పొద్దంత పోలీసుల లొల్లి. రాత్రయితె అన్నల లొల్లి. మింగుమంటె కప్పకోపం వద్దంటె పాముక్కోపమన్నట్టుండె గక్కడి పరిస్థితులు. గా గడబిడలు పడలేక ఉన్న ముత్తెమంత భూమిని గూడిడిసి పెట్టత్తిమి..'' అంది బుచ్చవ్వ.

''గిప్పుడు మనుపటంత ముమ్మిరేం లేదే అవ్వా ల్లల్ల..''

''గట్లెందుకంటను కొడుక. నాకు తెలువదా ఊళ్ళ పంతగతి.. ఊళ్ళన్ని అగ్గి గుండాలోలెనే ఉండె. మరి గిక్కడికచ్చి ఏమన్న బామకున్నమా అంటె ఏం గన వడ్తలేదు. ఏదో బట్ట పొట్టకు గడుత్తంది.''

తల్లి మాటల్లోని ఆర్ద్రతకు రాఘవులు హృదయం తడవుతుంది. కండ్లపొంటచ్చే నీళ్ళనాపుకున్నడు.

''అవునే అవ్వ. మన బతుకులు ఏడికిపెయినా ఏడే మాన్కలన్నట్టు గావట్టె. ఇంతయినా దుడ్డాన్నోనిదే బర్రెమరి!''

అందరచ్చినట్టే కద..! రైట్ రైట్..'' అని రాడ్ మీద పంచ్‌తోని రొండు దెబ్బలేసిండు కండక్టరు.

బస్సు కదులుతుంది.

''పైలం బిడ్డా..పైలం.పైలంగ పొయ్యిరా.. పండుగ తెల్లారి వచ్చెయ్..'' అంది బస్సు పక్కన నడుసుకుంట బుచ్చవ్వ.

''నేను మా వత్తగని నువ్వయితె పైలంగ పోయే ఇంటికి. గింత మందిల నువెదుకే అంటె సాగదోలుటానికత్తిని..''

''మనమడున్నడు గదా తీసుకపోతడు..నీకే పైలం బిడ్డా..'' కనుగుడ్ల నిండ నీళ్ళతో అంది బుచ్చవ్వ.

బస్సు కదిలింది. జనాన్ని చీల్చుకుంటు మందగమనంతో నడుస్తంది.

''టికెట్..టికెట్?.'' కండక్టర్‌కు డబ్బులిచ్చి టికెట్ తీసుకున్నడు రాఘవులు.

''పైలం బిడ్డా..పైలం..''

తల్లి మాటలనే నెమరు వేసుకుంటున్నడు రాఘవులు.

బస్సు కరీంనగర్ దిక్కు పరుగులు తీస్తుంది. టిక్కెట్లు ఇవ్వడం పూర్తి చేసి కండక్టర్ తన సీట్లో కూర్చున్నడు.

''పైలం బిడ్డా..పైలం..పైలం..''

రాఘవులు చెవుల్లో తల్లి మాటలే ప్రతిధ్వనిస్తున్నయి..

పైలం..పైలం...పైలం..తల్లులు పిల్లల్ని పైలంగా పోయిరమ్మని సాగనంపుతనే ఉన్నరు. మాడు నాలుగు తరాల నుంచిది జరుగుతనే ఉంది. ఎంతోమంది కడుపుల చేతుల పట్టుకొని ఊళ్ళిడిసి పోతనే ఉన్నరు.

కాని పైలం ఎక్కడుంది?

ఇక్కడ పిల్లలకు భద్రతుందా? అక్కడ తల్లులకు భద్రతుందా? ఎవరికైనా తన తల్లిలాంటి వృద్ధులు కోరుకునే పైలమైన బతుకు దొరుకుతుందా? ఎక్కడుంది పైలం? ఎవరికుంది భద్రత?

గట్టిగా కళ్ళు మూసుకున్నడు రాఘవులు..

రాఘవులు మనసు తన పదేళ్ళ వయసులోకి గతంలోకి పరకాయ ప్రవేశం చేస్తుంది. అతని కళ్ళ ముందెన్నో దృశ్యాలు కదులుతున్నయి..


పైలం..
పైలం...పైలం..
తల్లులు పిల్లల్ని పైలంగా
పోయిరమ్మని సాగనంపు
తనే ఉన్నరు. మాడు నాలుగు
తరాల నుంచిది జరుగుతనే
ఉంది.
పైలం ఎక్కడుంది?
ఇక్కడ పిల్లలకు భద్రతుందా?
అక్కడ తల్లులకు భద్రతుందా?
ఎవరికైనా తన తల్లిలాంటి
వృద్ధులు కోరుకునే పైలమైన
బతుకు దొరుకుతుందా?
ఎక్కడుంది పైలం? ఎవరి
కుంది భద్రత?


***

కరీంనగర్ జిల్లా పెద్దపల్లి ప్రాంతంలోని ఊళ్ళవి. నైజాం పోరాటాలను, భూపోరాటాలను చవి చూసిన ప్రాంతాలు..

వాకిట్ల వాల్చున్న నులుకమంచంల కూర్చున్నడు లచ్చులు.

''ఇంతంత భూమున్నమాట నిజమే కాని వానగొడితె పండినట్టు లేకుంటె ఎండినట్టేనాయె. ఎమసంల ఎంత జేసినా చేతిని మూతి కన్నట్టే కావట్టె..పొల్లగండ్లేమొ ఒగలెనుకొగలు పుట్టకు రావట్రి..గీ ఆదాయంతోనెట్ల బతుకుడు? బట్ట పొట్ట వెల్లుడుగూడ కష్టమే ఐతదిగ..'' అంది బుచ్చవ్వ.

''గా మాట నిజమేకని నన్నేం జెయ్యిమంటవు మరి! ఎంతజేసినా ఎక్కడేసిన గొంగడక్కడన్నట్టే గాబట్టె..'' అన్నడు లచ్చులు.

''మన సంగతిడిసి పెట్టుగని పొల్ల గండ్లను కొంచెమన్న సదివియ్యాలెగద..మన రాఘవులును బడికి తోలవడితిమి..గీ పనిలోని ఖర్చులన్నెల్లుతయా?''

''మరయితె నన్నేం జెయ్యిమంటవో సెప్పు!''

''ఏం జెయ్యమనటానికి నాకు నోరత్తలేదుగని? ఇక్కన్నే ఎంటెమాత్రం మతుకుడు కష్టమే..''

''మరి నన్ను బొంబైకి పొమ్మంటవా ఏంది?'' కోపంగన్నడు లచ్చులు..

''పొమ్మనటానికి నాకు నోరెట్లత్తదిగని ఇక్కడయితె ఖర్చులకన్న సరిపోదీ ఆదాయం..పోతె నాలుగు కొత్తలు ఎనుకేసుకోవచ్చు..పొల్లగండ్లను సదివిచ్చుకోవచ్చు...మనూరోల్లు ఎంతమంది భీవండికి, బొంబైకి పోయి బతుకుత లేదు..''

''ఆం.. ఇంత పొడుగు బతుకు తండ్రి తియ్యి.. భీవండికి పొయ్యి గడుదాసు మొండయ్య ఎట్లయిండు? నడిమెట్ల మల్లయ్య టీబీతో నెండుకచ్చె! దుబ్బ, ధూళిల కూలిపను లందరికి పడుతయా?''

''అయితె గిట్లనే ఎదుగు బొదుగు లేకుంట బతుకుదామంటవా? కాలుపాయిగ తినకున్నా బట్టపొట్టకన్న ఎల్లకుంటె టుల?'' అంది బుచ్చమ్మ.

''మంచిదానివే ఉన్నవే బుచ్చమ్మ...లచ్చుల్ను ఊళ్ళె ఉండనిచ్చెటట్టులేవు గద! కడుపలోపలున్న సుబ్రం కాశికిపోయినా దొరుకదన్నరు పెద్దలు.. గీ పనితో మేం బతుకలేదా? మీరు బతుకుతలేరా? కొడుకును భీవండికి పొమ్మని ఊలవెట్టవడితివేంది?'' అంది రాములమ్మ.

అత్త మాటలకు వెంటనే అందుకుంది బుచ్చమ్మ.


''నీకేమొ కొడుకు మీద మాలావు పావురముంది. నాకేమొ లేదు గద! మోసెటోల్లకెరుక కావటి బరువన్నరు.. నువ్వేమన్న పదులు, ఇరువైల ఎకురాలు పంచిత్తివా? ఒక్కెకరం పొలం, మూడెకరాల దుబ్బ భూమేకద మాకచ్చింది మల్ల ఇవ్వేమన్న దండి భూములా? గివ్వెట్ని చేసుకుంట నలుగురు పొల్లగాడ్లనెట్ల సాదుమంటవు?'' అంది నిష్ఠూరంగా.

''నువ్వే మోత్తన్నవు తియ్యి కావడిబరువు. ఎవ్వలు చెయ్యలేదా సంసారమింతకు ముందు..నేను సాదుకోలేదా పిల్లలను సంపాదన సంపాదనని నా కొడుకుకును ఊరిడిసి పొమ్మనవేస్తివేంది?'' అంది కోపంగా.

బుచ్చమ్మ కొంత తగ్గింది.

''మీకాలం వేరత్తా. రోజురోజుకు ఎన్ని మార్పులత్తున్నయో సూత్తలేవా? గా బక్కోటితోని నీల్లు లేనిగా భూమిని దున్నుకుంట నలుగురు పోరగాండ్లను సాదుడెట్ల సెప్పు..'' అంది నెమ్మదిగా.

''గా మాట నిజమేనే అవ్వ..నీ కోడలన్నదాంట్ల




తప్పేంలేదు. ఆడగాలం కష్టపడ్డా చేతికి మూతికిగూడ అయితలేక పోతెట్ల?''

కొడుకు కూడ కోడల్ను సమర్థించేసరికి రాములమ్మ ముఖం చిన్నబోయింది.

''నేం జెప్పింతె వింటరా బిడ్డ మీ ఇష్టమున్నట్టు చేసుకోండ్రి.. అయినా నేనింకెంతకాలం బుతుకుత! ఊరు పొమ్మంటంది. కాడు రమ్మంటంది. సరెగని ఎక్కడికి పొయ్యి సంపాయించుకత్తమే బిడ్డ...'' అంది.

''ఎక్కడికో కని ఇక్కడయితుండనే అవ్వ! గ్యారా కద్దూ బారా కొత్వాల్ అన్నట్టుంది. ఊళ్ళె సంగతి పోలీసు పటేల్, పట్వారి, మాలిపటేల్ ఎవ్వల నేమనత్తది..నీ యవ్వ! బతుకంత ఆగమాగం గావట్టె..!''

అననయితే అన్నది కాని భర్త ధేశం పోతననెవారకు బుచ్చమ్మకు బాధనిపించవట్టింది. కాని పిల్లలను సాది సవరిచ్చు కోవన్నెంటె ఔననక తప్పలేదు.

లచ్చులు భీవండికి పోవుటానికే నిర్ణయించుకున్నడు.

కొడుకు ఊరొదిలి పోయే రోజు దగ్గరికొస్తున్నకొద్దీ రాములమ్మ గుండె కొట్టుకుంటుంది. కొడుకుని పట్టుకొని ఏడ్వసాగింది.

''లచ్చన్నా! పదేండ్ల పొల్లగార్నిడిసిపెట్టి పోవడ్తవి.. ఏమన్నంటె అప్పులు పెరుగుతున్న యనవడ్తివి. మేం బతుకలేదా అంటె వింటలేకపోతివి. నీ పెండ్లామేమొ ఊలవెట్టి కూసుండె..''

అత్తమాటలకు మరింత దుఃఖం పెల్లుబికి వచ్చింది బుచ్చమ్మకు. ''నన్నెందు కాడిపోసుకుంటవు? అప్పుడన్న మాట నిజమే కాని అయినె పోవన్నవని నాకేం లేదు. ఈ పొల్లగాండ్లతోని ఎట్లేగిచ్చుడని నేనెడుత్తుంటె నీ మీద నువ్వేడ్వబడ్తివి..'' అంది బుచ్చమ్మ కంటినీరు తీసుకుంటూ..

''గా సంగతి నాకెరుకలేదా బిడ్డ.. కాని కడుపుతీపి క ట్లంటి..కాని, తల్లి కడుపు సూత్తది..పెడ్లాం జేబు సూత్తదని వట్టిగనే అన్నరా ఏంది?''

''అందరి కుంది తియ్యిసాలు. నాకు కొడుకుల్లేరా?''

''అవ్వా! బుచ్చమ్మా మీరెందుకు అత్తిరుకం కోడలిరుకం సేసుకుంటరే! నేను కుంటుంబం కోసమే పోతన్న.. ఎవ్వలు వద్దన్నా, పొమ్మన్నా ఇది తప్పక పోవు. భీవండికి ఎల్లుండే ప్రయాణం.'' అన్నడు లచ్చులు.

''గా గోదెవరిఖన్లె బొగ్గుబాయిలు పడ్డయట గద..మనూరోల్లు ఇప్పుడిప్పుడే పోతున్నరు. గక్కడికి పెయనా..దగ్గరుండు..జీతాలు గూడ బాగనే ఉంటయట.. గీ దగ్గరికన్న గాకుండ దేశంగాని దేశం మాట దేశం పోతననవడ్తవి..'' అంది రాములమ్మ.

''గోదావరిఖన్లె బాయిలు పడ్డమాట నిజమేకాని ముప్పయేండ్లు దాటిన నాకు గా పని సాతనయితదా..నాలె బొయ్యారంలకు పోయినట్టు లోపలికి పోవన్నాయె..గండ్లకు పొయ్యి బైటికత్తె మనిషి మల్ల పుట్టినట్టేనాయె..గండ్ల ప్రమాదాలెక్కువ. భీవండిలనయితె ఏపనయిన దొరుకుతాది..''

''గావచ్చుకాని గా భీవండిల మన మాటగాకపాయె.మన తిండిగాకపాయె..గా గాలివడ్తే.. గా తిండి వడ్తదా? ఎట్ల బతుకుతమీ బిడ్డ..''

''అలవాటయితె అన్ని అవ్వేపడుతయవ్వ! అలువాటు జేసుకోవాలె...పొట్ట తిప్పలకు జెర్రిపోతులాటన్నరు గద!''

లచ్చులు భీవండికి వెళ్ళే రోజు రానేవచ్చింది. అందరిగుండెలు బరువెక్కినయి...న ఒకర్నిపట్టుకొని ఒకరేడ్చిండ్రు...

''అక్కడెట్ల నెగులుతవో బిడ్డ! గూడగాల్లు బాగుండరటక్కడ.. ఎవ్వలతోని కొట్లాటపెట్టుకోకు.. ఎవ్వలనేమన్న అన్నా తలవంచుకొని పో.. పైలంగ పోయిరా బిడ్డా..పైలం..పైలం..''

రాములమ్మ కొడుక్కు ఎన్నో జీగ్రత్తలు చెప్పుతుంది.

''పైలం బిడ్డా పైలం..'' అని వీడ్కోలు పలికింది.

కళ్ళనీల్లు తీసుకుంటూ వెళ్ళిపోయాడు లచ్చులు.

ఆరునెలలు గడిచినయి. అక్కడ కలహాలు మొదలైనయి..స్థానిక, స్థానికేతర, మత కొట్లాటలు పెరిగినయి. గృహదహనాలు..కత్తిపోట్లు..హత్యలు..నానా భీభత్సం జరిగింది.

..డిలున్న లచ్చులు లాంటి చాలా మంది బతుకపోయినొట్లె ఊరుకు తిరిగిరావడానికి స్టేషన్‌కు పరుగెత్తుకొస్తున్నారు. కొందరు రైల్వేస్టేషన్ చేరుకున్నరు. లచ్చులు మాత్రం దుండగులకు దొరికాడు. కత్తిపోట్లకు గురయిండు.

అక్కడిక్కడే మరణించాడు.

రాజమల్లు లచ్చులు సూటుకేసు తెచ్చి ఇంట్లో అప్పగించాడు.

రాములమ్మ చెప్పిన పైలం బిడ్డా జాగ్రత్తలు, ఆశీస్సులు లచ్చులును కాపాడలేదు. బుచ్చమ్మ భర్తను కోల్పోయింది. రాములమ్మ కన్నపేగుకు దూరమయింది. రాఘవులు, బుచ్చమ్మ ఇతర సంతానం తండ్రిలేని పిల్లలయ్యారు. ఇల్లు శోక సముద్రమయింది.

ఊళ్ళో ఆర్థికంగా 'పైలం' లేదని ఊరొదిలిపోతే బతుక్కే పైలం లేకుండయింది. కొడుక్కొరకు ఏడ్చుకుంటూ రాములమ్మ చనిపోయింది.

***

రాఘవులు చదువు మార్పించక తప్పలేదు.

ఆ తర్వాత కొద్దికాలంలోనే ఊళ్ళో పోరాటాలు మొదలయినయి. ఊళ్ళు అగ్నిగుండాలుగా మారిపోయినయి.

నూనూగు మీసాల నూత్న యవ్వనంలోకి అడుగుపెడ్తున్న రాఘవులు ఇంటి భారాన్ని మోస్తున్నడు.. వ్యవసాయం ఆధారంగ బతుకుతున్నడు.

రాఘవులు తమ్ముడు రాజన్న పోరాటాలకు ఆకర్షితుడవుతున్నడు.

బుచ్చమ్మ లబలబా మొత్తుకుంటుంది.

రాజన్న మాత్రం తన విధానాన్ని మార్చుకోలేదు.

ఇంటిపై పోలీసుల నిఘా పెరిగింది. ఒత్తిడి పెరిగింది.

అడుగడుగునా అనుమానం.

రాజన్న ఇంటికి రావడం తగ్గింది.

ఓరోజు ఇంటికొచ్చి రాజన్నను పట్టుకొని ఏడ్చింది బుచ్చమ్మ.

''అవ్వా! పైలం పైలం అని నాయినమ్మ నాయిన్నను పంపించింది నా కండ్లముందింకా కదులుతుంది. కాని ఎక్కడుందమ్మా భద్రత? ఎవరు మాత్రం పైలంగా ఉన్నారు? మీరంతా కోరుకునేది వ్యక్తిగత పైలం... అది కూడా వీలు కావడం లేదు.. మేం పోరాడేది అందరు పైలంగా బతికే వ్యవస్థ కోసం. ఈ సమాజంలోని అభద్రతా భావాన్ని భగ్నం చేయడానికే మేం పోరాడుతున్నం..నా గురించి ఆలోచించకు. ఈ పోరాటంలో నేను పోయినా పోవచ్చు'' అన్నడు రాజన్న.

ఆ మాటలు బుచ్చమ్మకు అర్థమైనట్టున్నయి. ఆమె ఏడుపులు కడుపునాపలేకపోయినయి..

ఆ ఇంటిపై పోలీసుల నిఘా మరింత పెరిగింది. రాజన్న కోసం పోలీసులు మరీమరీ వేధించడంతో

ఊళ్లో రాఘవులు బతుకు దుర్భరమైంది.

"అవ్వా! తమ్ముడెట్లాగూ విడిచిన ముల్లయిండు.. మన బతుకూ దుర్భరమయింది. ఇక్కడుండటం మనవల్ల కాదు. పొద్దంతా పోలీసులు, రాత్రయితే వాళ్ళు దినదిన గండంగా ఎన్ని రోజులని బతకడం!" అన్నడు రాఘవులు.

ఆ మాటలు నిజమేననిపిస్తున్నయి బుచ్చమ్మకు.

"అయితేం చేస్తనంటవు బిడ్డా!"

"నేను హైదరాబాదెల్లిపోత.. ఏదైన పని చూసుకుంట.. అదయితె సముద్రం గద! ఎవ్వలు పట్టించుకోరు. తర్వాతొచ్చి నిన్ను తీసుకపోత..."

అప్పుడు భర్త, ఇప్పుడు కొడుకు ఊరు విడిచిపోవడం బుచ్చవ్వకు భరించ రాకుండానే ఉంది.

"అక్కడ రౌడీలుంటరు. గూండగాళ్ళుంటరు.. మోసగాల్లుంటరు. ఎట్ల నెగులుతవో ఏమొ? నువ్వేమొ నోట్లె నాలుక లేనోనివి.." అంది బస్సులో కూర్చున్న కొడుకుతోని.

రాఘవులు ఊరిడిచి పోయేవరకు ఊళ్ళెకు బస్సొస్తుంది.

"ఎట్లనో బతుకుతనే అవ్వ. కొన్ని రోజులల్ల వచ్చి నిన్ను తీసుకపోత.. చెల్లెండ్లకు పెళ్ళిళ్ళాయె..నీవొచ్చ దానివెట్లుంటవింట్ల?"

కనుగుడ్ల నిండా నీళ్ళతో "ఫైలం..ఫైలం.." అని హెచ్చరిస్తూనే ఉంది బుచ్చవ్వ..రాఘవులును మోసుకొని బస్సు కదిలింది.

హైదరాబాద్ డైరీఫాంలో చిరుద్యోగం సంపాదించుకున్నడు.. తల్లిని తీసుకువెళ్ళి అక్కడే ఉంటున్నాడు.

అనేక సమస్యలవల్ల భూమిజోలికి పోలేదు. ఈలోగా రాజన్న ఎన్‌కౌంటర్‌లో మరణించిండు.

పట్టణంలో జీవితం పల్లెలో కంటె భద్రంగా ఏంలేదు.

అయినా ఆ జీవితానికలవాటు పడ్డాడు. పిల్లలు కలిగారు.

తనకున్న చిన్న ఉద్యోగం స్వల్ప ఆదాయంతోని పిల్లలను పెద్ద చదువులు చదివించలేకపోయిండు. ఇక్కడ ఆదాయం పల్లెలో ఉన్నప్పటి కంటె ఎక్కువగానే ఉన్నా ఖర్చులూ ఎక్కువగానే ఉండి అంతకంటె ఎక్కువ సుఖమేం లేనట్టు గమనించిండు..

కొన్నిసార్లు అక్కడికంటె ఇక్కడే అభద్రంగ ఉన్నట్టు రాఘవులు అనుభవంలోకొస్తుంది.

అక్కడ కమ్మటి నీల్లు, చల్లటిగాలన్న దొరికేది.. ఇక్కడేం పాడయింది మరి..అని అనేకసార్లనుకున్నడు..

కొడుకును దుబాయ్‌కి పంపక తప్పలేదు రాఘవులుకు. ఆరోజు రాఘవులు, సరోజ గొడగొడా ఏడ్చిండ్రు..

"ఫైలం బిడ్డా ఫైలం..' అని సరోజ హెచ్చరించింది..

పొద్దు గూట్లోపడింది. బస్సు పరుగులు తీస్తూనే ఉంది. రాఘవులు ఆలోచనా పరంపర కొనసాగుతూనే ఉంది.

ఎంతోమంది తల్లిదండ్రులు తమ పిల్లల కోసం 'ఫైలం ఫైలం' అని చెప్పుతనే ఉన్నరు. వాళ్ళ భద్రత కోసం ఆరాట

పడుతనే ఉన్నరు..

భీవండి బొంబయిలకు పోయేవాళ్ళు.. దుబాయ్...మస్కట్‌లకు పోయేవాళ్ళు..పాలమూరు నుంచి దేశమంతటికీ పోయేవాళ్ళు పోతూనే ఉన్నరు. కొన్నిండ్లకు తాళాలు పడుతూనే ఉన్నాయి..

కొందరు ముసలి తల్లిదండ్రులు గలుమల దగ్గర కూచొని కొడుకుల కోసం ఎదిరిచూస్తూనే ఉన్నరు.

దేశమే వదిలి విదేశాలకు పోవడమూ మొదలయింది. అందరికీ 'ఫైలం..ఫైలం..' అని చెబుతూనే ఉన్నారు తల్లులు..

కాని ఎక్కడుంది భద్రత?

అందరూ ఫైలంగా తిరిగొస్తున్నరా?

అక్కడ ఫైలంగా బతుకుతున్నరా?

పల్లెనుండి పట్నం పోతే భద్రంముందా? పట్నం నుండి పల్లెకు పోతే భద్రతుందా? రాష్ట్రం విడిచి వేరే చోటుకు పోతే ఫైలంగా ఉంటున్నారా? దేశాన్నే విడిచి పెట్టిపోతే భద్రంగా ఉంటున్నారా?

ఎవరి బతుకుల్లో ఫైలముంది?

అయినా కనుగుడ్ల నిండ నీళ్ళతో ఎంతోమంది తల్లులు 'ఫైలం బిడ్డా ఫైలం' అని చెబుతూనే ఉన్నారు.

తన తల్లీ అంతే.

కాని భద్రతెక్కడుంది? ఎక్కడుంది?

***

'మీ ఊరొచ్చేసింది సార్..బస్సు దిగుండ్రి..' కండక్టర్ మాటలతో ఈలోకంలో కొచ్చిండు రాఘవులు..

బస్సుదిగిండు.. ఎదురుగా ఇద్దరు మిత్రులు..

"రాయే రాగన్నా..! రా..రా! పదేండ్లాయె నువ్వూరికి రాక.." పలుకరించిండా కిష్టయ్య..

"అంత మంచిదేకద రాఘవులు?" చేతిలో చేయి కలుపుతూ అన్నడు వెంకటేశు..

"ఏం బాగో ఏమో..అట్లున్న.."

"నువ్వూరికెందుకచ్చిననో నాకెరికేకని..నువ్వచ్చుడు వట్టి బొక్కలకు గొండ్రిగాడాశపడ్డట్టే అయితంది..'

"ఏంది కిష్టయ్యా నువ్వనేది?" అన్నడు రాఘవులు నడిచే వాడాగుతూ..అతన్తోపాటు వాళ్లా ఆగిండ్రు.."నీకున్న గా కొంచెం భూమిని వచ్చిన ధరకు అమ్ముక పోదామని నువ్వత్తున్నవని నాకెరికే.. కానీ, గా భూమెక్కడుంది?" అన్నడు వెంకటేశం..

"భూమెటుపోతుంది ఉండకుండ..?"

"నీ దుబ్బ భూమి ఊరు పక్కకుంది గద! సానేండ్లవట్టి పడావుండబట్టె.. ఇండ్లు గట్టుకుంటానికి తలింత ఇచ్చేసింద్రు.. అందరిండ్లు గట్టుకున్నరు.. పొలమేమొ మొన్నటి భూమి పంపుకాలల్ల పోయింది.!"

రాఘవులు కళ్ళక్కడే పాతుకు పోయినట్టు కదలడం లేదు. నోట్లోంచి మాట కూడా పెకిలి రావడం లేదు..

"నేనేం భూసామిని కాదు గద! గట్లెట్ల పోతది నా భూమి." అన్నడు మెల్లగా..

"గవ్వన్ని మాకేమెరుక..కాని జరిగిందిది.."

"మనిషికే కాదు.. భూమికి కూడా భద్రత లేకుండా పోయిందా?" అనుకోకుండా ఉండలేకపోయిండు రాఘవులు.

తల్లి చెప్పిన ఫైలం ఫైలం బిడ్డా మాటలే ఆతని చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి..

తనకు తల్లి ఫైలం చెప్పింది..కాని భూమికి?

కొద్ది క్షణాలట్లనే నిల్చున్నాడు రాఘవులు..

"ఏంటి రాఘవులూ..! భూమిపోయిందని బాధ గుందా? మాట్లాడుత లెవ్వు..!"

"అది సహజమే కద వెంకటేశం..కాని, నాకిప్పుడు బాధ కంటె సంతోషమే ఎక్కువుంది.. ఎందుకంటే నేనా భూమిని దున్నుత లేను. నా కొడుకు గూడ దున్నడు. అది చేరవల్సినోల్ల చేతుల్లోకి చేరింది. గట్లనే అన్ని భూములు చేరితె బాగుండు.. వాళ్ళయితె అండ్లపని చేసి పంటలు పండిత్తరు. నేనిక్కడ ఉన్నప్పటికంటె ఎక్కువ భూములు ఇప్పుడు చేరాల్సిన వాళ్ళ దగ్గరికి చేరినయి.. కాదంటవా..? గందుకే నాకు నా భూమి పోయినా మంచిదేకని సంతోషం గుంది.."

ఆ మాటలకు ఆశ్చర్యంతో నోళ్ళు తెరిచింద్రు మిత్రులు..

" ఏంది రాఘవులూ నువ్వనేది?"

"వీళ్ళ చేతుల్ల భూములుంటేనే గా భూమి ఫైలం గుంటది.. అన్ని భూములు వాళ్ళ చేతుల్లకు పోతెనే భూమికి నిజమైన ఫైలం. నేనీ తిరుగు బస్సుల లస్కర్‌కు పోత..."అని వెనకకు మల్లిండు రాఘవులు.

★

